ఆస్పరిలో జీపు జాతానుద్దేశించి మాట్లాడుతున్న గౌస్ దేశాయ్

కరువే లేదంట...!

- ఖరీఫ్‌లో ఉమ్మడి జిల్లాలో 8 డ్రైస్పెల్ మండలాలు
- కరువు మండలాలు లేనట్లు ప్రభుత్వం ప్రకటన

ఒక వైపు రైతు వాతావరణ పరిస్థితుల వల్ల నష్టాల బాట పడుతుంటే ప్రభుత్వం మాత్రం రైతులపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఖరీఫ్‌లో ఉమ్మడి జిల్లాలో 8 మండలాల్లో డ్రైస్పెల్ పరిస్థితులు ఏర్పడినా అసలు కరువు మండలాలే లేనట్లు ప్రభుత్వం ప్రకటించింది...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఇటీవల మొంథా తుపాన్ వర్షాలను చూపించి ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ కీలక సమయంల్లో నెలకొన్న తీవ్ర వర్షాభావాన్ని, డ్రైస్పెల్‌ను పరిగణలోకి తీసుకోకుండా పలు ప్రాంతాల్లోని కరువే లేనట్లు ప్రభుత్వం ప్రకటన చేసింది. ఒక మండలంలో వరుసగా 21 రోజులు వర్షం కురవకపోతే దాన్ని ఒక డ్రైస్పెల్‌గా పరిగణిస్తారు. పంటలు సాగైనా డ్రైస్పెల్ నెలకొంటే పైకి ఎదగవు. ఎండిపోతాయి. దిగుబడి పడిపోతుంది. అలాంటి పరిస్థితి ఖరీఫ్‌లో కర్నూలు జిల్లాలో నాలుగు మండలాలు, నంద్యాల జిల్లాలో నాలుగు మండలాలతో కలిపి ఉమ్మడి జిల్లాలో ఎనిమిది మండలాల్లో ఏర్పడింది. ఆ పరిస్థితిని కూడా ప్రభుత్వం పట్టించుకోకుండా జిల్లాలోని ఒక్క మండలాన్ని కూడా కరువు మండలంగా ప్రకటించలేదు. జిల్లాలో ఖరీఫ్ ప్రారంభంలో కాస్త చినుకు జాడ కనిపించడంతో పంట సాగుకు రైతులు ఆసక్తి చూపారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు కొంచెం ముందుగానే మే 25, 26 తేదీల్లో రాష్ట్రంలో ప్రవేశించగా తొలి నాళ్లలో బాగానే వర్షాలు పడ్డాయి. అనంతరం దీర్ఘకాలం మొరాయించాయి. అడపాదడపా వచ్చే వర్షాలతో రైతులు అతికష్టం మీద సాగును సాగించారు. తీరా పంట ఎదిగే సమయంలో పంట తడికి సరిపడా వర్షం కురవకపోవడంతో ఈ ఖరీఫ్‌లో రైతులు ఆశించిన స్థాయిలో దిగుబడులు రాలేదు. అయితే సరైన వర్షాలు లేక సరైన దిగుబడులు అందలేదు. వర్షంపై ఆధారపడిన పశ్చిమ ప్రాంతంలోని ఆదోని, ఎమ్మిగనూరు, హోళగుంద, ఆలూరు, ఆస్పరి, కోసిగి వంటి మండలాల్లో పత్తి పంట చాలా వరకు దెబ్బతింది. గతేడాదికన్నా చాలా తక్కువ దిగుబడి వచ్చింది. కంది పంట కూడా ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. సరైన వర్షం లేక ఈ ఖరీఫ్‌లో రైతన్నలు తీవ్ర నష్టాన్ని మూటకట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయినా కూడా ప్రభుత్వం జిల్లాలో కరువు మండలాలను గుర్తించకపోవడంపై రైతులు, రైతు సంఘాల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

గతంలోనూ నిర్లక్ష్యం

కరువు మండలాలను ప్రకటించే విషయంలో గతంలోనూ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. ఖరీఫ్‌లో జిల్లాలోని చాలా మండలాల్లో తీవ్ర దుర్భిక్షం తాండవించగా 15 మండలాలనే కరువు మండలాలుగా ప్రకటించింది. రబీలోనూ కర్నూలు జిల్లాలో 9, నంద్యాల జిల్లాలో 5 మండలాలు ఎంపిక చేసింది. జిల్లా పశ్చిమ మండలాల్లో తీవ్ర కరువుతో తల్లడిల్లుతున్న పలు మండలాలకు ఆ జాబితాల్లో చోటు దక్కలేదు.

ఆస్పరిని వేదవతి పరిధిలోకి చేర్చాలి

- పందికోన నుంచి మండలానికి నీరివ్వాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరి మండలాన్ని వేదవతి ప్రాజెక్టు పరిధిలోకి చేర్చి తాగు, సాగు నీరందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. పందికోన రిజర్వాయర్ నుంచి ఆస్పరి మండలానికి పైపులైన్ వేసి నీరు తీసుకురావాలన్నారు. గ్రామాల్లో తాగునీరు సక్రమంగా సరఫరా కాక, రోడ్లు, డ్రెయినేజీ కాలువలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గురువారం ఆస్పరి మండలం బిల్లేకల్లు గ్రామంలో సిపిఎం మండల కార్యదర్శి బాలకృష్ణ ఆధ్వర్యంలో గౌస్‌దేశాయ్ ముఖ్య అతిథిగా హాజరయి జీపుజాతాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి లేదని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. జిల్లాలో రైతులు సాగు చేసిన పత్తి పంటలు అనావృష్టి, అతివృష్టి కారణంగా పూర్తిగా దెబ్బ తిని తీవ్ర నష్టపోయారని తెలిపారు. ఉల్లి పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు రోడ్లపై, కాలువల్లో పారబోశారని, వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం ముందుకు రాలేదని మండిపడ్డారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. వర్షాల వల్ల పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ప్రకటించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 10న ఉదయం 10 గంటలకు ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. జీపుజాతా ముత్తుకూరు, పుట్టకలమర్రి, వలగొండ, పుప్పాలదొడ్డి, కైరుప్పల, కలపరి, యాటకల్లు, ములుగుందం గ్రామాల్లో సాగింది. సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు రంగస్వామి, సీనియర్ నాయకులు నరసింహులు, గ్రామ కార్యదర్శి వీరభద్ర, డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు శ్రీకాంత్, సభ్యులు పురుషోత్తం, పరమేష్, ఆటో యూనియన్ నాయకులు ప్రకాష్ పాల్గొన్నారు. **మంత్రాలయం** మండలంలోని 15 గ్రామాల్లో జీపుజాతా నిర్వహించారు. రాఘవేంద్ర సర్కిల్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కెవి.నారాయణ మాట్లాడారు. ఏ గ్రామంలో చూసినా తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, కూటమి నాయకులు సమస్యలు పరిష్కరించాలని కోరారు. సాగునీటి సమస్య పరిష్కారానికి ఈ ప్రాంతంలో ఉన్న ఆర్‌డిఎస్ కుడికాలువ పనులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. గురు రాఘవేంద్ర లిఫ్ట్ ద్వారా మాధవరం, సూగూరు లిఫ్టులకు, బసలదొడ్డి లిఫ్టు ద్వారా సాగు, తాగునీరు అందించాలని కోరారు. మండలంలోని చిలకలడోన, కల్లుదేవకుంట గ్రామాలకు పాత పైపులైన్ తొలగించి కొత్త పైపులు వేసి తాగునీరు అందించాలని తెలిపారు. ఎస్ఎస్ ట్యాంకు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం పెద్దకడుబూరు మండల కార్యదర్శి ఈ.తిక్కన్న, మంత్రాలయం మండల కార్యదర్శి హెచ్.జయరాజు, సిపిఎం కార్యకర్తలు టి.లక్ష్మన్న, టి.ప్రాణేష్, జి.అంజి, ఎం.రాజు, దేవదాసు, శ్రీను, ఆశీర్వాదం, బసన్న, అహ్మద్ పాల్గొన్నారు.

మంత్రాలయంలో జీపు జాతానుద్దేశించి మాట్లాడుతున్న నారాయణ

వినియోగదారులకు అందుబాటులో ఉండాలి

- ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ ఆర్.ప్రదీప్‌కుమార్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఇ ప్రదీప్ కుమార్

వినియోగదారులకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందిస్తూ అధికారులు అందుబాటులో ఉండాలని ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ ఆర్.ప్రదీప్ కుమార్ సూచించారు. గురువారం కర్నూలు జిల్లా విద్యుత్ భవనంలో కర్నూల్ టౌన్ విద్యుత్ అధికారులతో సమీక్ష సమవేశం నిర్వహించినారు. ఇందులో భాగంగా అధికారులకు నాణ్యమైన విద్యుత్ , నిరంతర విద్యుత్ సరఫరాను అందించి విద్యుత్ అంతరాయలను తగ్గించి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలను తగ్గించి వినియోగదారులకు నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరాకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ పెంచుటకు అధికారులు , విద్యుత్ సిబ్బంది అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని దిశా నిర్దేశం చేశారు. వినియోగదారులకు పీఎం సూర్యఘర్ స్కీం కింద సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసి వారి విద్యుత్ బిల్లును తగ్గించుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించి వారిని బలోపేతం చేయాలని ఆదేశించారు. భద్రత ప్రమాణాల గురించి వినియోగదారులకు ఎప్పటికప్పుడు తెలియపరుస్తూ విద్యుత్ ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. గౌరవ సిఎండి ఎపిఎస్‌పిడిసిఎల్ ఆదేశాల మేరకు ప్రతి సెక్షన్ అధికారి నెలకు తమ పరిధిలో రెండు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను నిర్మించి వినియోగదారులకు ఓల్టేజ్ సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఓవర్ లోడ్ ఉండే 11 కెవి ఫీడర్లను బైఫర్ కేట్‌చేసి అదనపు పీడర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించినారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, జె.చిన్న రాఘవులు, వై.వి.మహేశ్వర్ రెడ్డి , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టెక్నికల్, భాస్కరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కన్‌స్ట్రక్షన్ టి.శేషాద్రి, కర్నూల్ టౌన్ టౌన్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

జిజిహెచ్‌ను సందర్శించిన అఖిల భారత సర్వీసుల అధికారులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు గురువారం అఖిల భారత సర్వీసుల అధికారుల బృందం సందర్శించింది. తెలంగాణ రాష్ట్రానికి చెందిన మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న 15 మంది అఖిల భారత సర్వీసుల అధికారులు (ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్, ఐసిఎఎస్, ఐఎస్ఎస్) ఈ బృందంలో ఉన్నారు. ఈ సందర్భంగా అధికారులు ఆసుపత్రిలోని ఓపి (అవుట్ పేషెంట్), ఐపి (ఇన్ పేషెంట్) సేవలను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి లభిస్తున్న వైద్య పరికరాలు, సదుపాయాల గురించి సమగ్రంగా తెలుసుకున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆసుపత్రి కార్యకలాపాలు, సేవలు, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలపై వివరించారు. ప్రజలకు సేవ చేయడం మనందరి ప్రధాన లక్ష్యం కావాలన్నారు. సానుకూల దృక్పథంతో పనిచేస్తూ, మనం పనిచేసే ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. అఖిల భారత సర్వీసుల అధికారుల బృందం ఆసుపత్రి వివిధ విభాగాలను సందర్శించారు. ఎమర్జెన్సీ విభాగం, న్యూ డయాగ్నస్టిక్ బ్లాక్ సూపర్ స్పెషాలిటీ తదితర విభాగాలకు సందర్శించారు. ఆసుపత్రి ఆర్ఎంఒ డాక్టర్ వెంకటరమణ, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సందర్శిస్తున్న అధికారులు

పక్కాగా ఈ-క్రాప్ నమోదు

- కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈ క్రాప్ నమోదులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పక్కగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గురువారం వ్యవసాయ, అనుబంధ శాఖల పై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... ఉల్లి పంట విత్తిన తేదీ, పంట పెరుగుదల వివరాలను సర్వే నంబర్ వారిగా, రైతుల వారిగా వివరాలను ఇవ్వాలన్నారు. సెప్టెంబర్ మొదటి వారం నుండి ప్రతి వారం ఎంత మేరకు క్రాప్ బుకింగ్ చేశారన్న వివరాలను సర్టిపై చేసి ఇవ్వాలని ఉద్యాన శాఖ అధికారిని ఆదేశించారు. మిరప పంటకు ఇటీవల ముడత వ్యాధి వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో వ్యాధి నివారణకు రైతులు జాగ్రత్తలు పాటించే విధంగా అవగాహన కల్పించాలని వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులను ఆదేశించారు. పత్తికి సంబంధించి రైతుల వివరాలను సీఎం యాప్‌లో, 'కపాస్ కిసాన్' యాప్లో స్లాట్ బుక్ చేసేందుకు రైతు సేవా కేంద్రాల అధికారులు రైతులకు సహా యం చేయాలన్నారు. పత్తికి సంబం ధించి రైతుల సమస్యలను పరిష్కరిం చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు కూడా తగ్గినందున పత్తిని ఆరబెట్టుకొని తీసుకొని వెళ్ళినట్లయితే మంచి ధర వస్తుందనే విషయాన్ని రైతులలో మరొకసారి అవగాహన కల్పించాలన్నారు. శనగలు, కందులు పంటలకు సంబంధించి కూడా ఏమైనా సమస్యలు ఉంటే రైతులతో మాట్లాడి సమస్యను వెంటనే తన దృష్టికి తీసుకొని రావాలన్నారు. రైతులు ఒకటే పంట సాగు చేయకుండా రెండు మూడు రకాల పంటలు సాగు చేయాలని, పాడిపశువులను పెంచుకొని ఆదాయం పెంచుకోవాలనే విషయాల ను రైతులకు రైతు సేవా కేంద్రాల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. నాచురల్ ఫార్మింగ్ మీద రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పాడి పశువులను పెంచుకొని ఆదాయం పెంచుకునే విధంగా రైతు సేవా కేంద్రాల అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతుల పండించిన పంటల ఉత్పతులకి సంబంధించి మార్కెట్ ట్రేడర్లకు లింక్ చేసి మంచి ఆదాయం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జెసి నూరుల్ కమర్, జెడిఎ వరలక్ష్మి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రాజాకృష్ణారెడ్డి,పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

డూప్లికేట్ ఓటర్లు లేకుండా చర్యలు : ఓటర్ల జాబితాలో డూప్లికేట్ ఓటర్లు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి , కలెక్టర్ ఎ.సిరి పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్‌యాదవ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుండి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, పాణ్యం నియోజకవర్గ ఇఆర్ఒ జెసి నూరుల్ కమర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)- 2025 కు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఇఆర్ఒలను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో విచారణ చేసి లోపాలు లేని ఓటర్ బాబితాను రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి, ఎస్‌డిసి అనురాధ, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్ పాల్గొన్నారు.

రికార్డు సర్టిఫికెట్ అందుకుంటున్న టిజి.వెంకటేష్,పత్తిఓబులయ్య

తెలుగు బుక్‌ఆఫ్ రికార్డులోకి టిజివి కళాక్షేత్రం

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

ఈనెల ఒకటో తేదీ నుంచి నిరాటకంగా సాగుతున్న కర్నూలు ఉత్సవాలు-2025 ఆధ్యంతం ప్రజలు తిలకిస్తున్న తీరును తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు పరిశీలించారు. గురువారం ఉదయం తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇస్తున్నట్లు ప్రకటించి చైర్మన్ టిజి వెంకటేష్‌కు జ్ఞాపికను, ప్రశంసా పత్రం అందించారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ చైర్మన్ వెంకటాచారి మాట్లాడుతూ కళాక్షేత్రం అనితర సాధ్యమైన కృషి సాహిత్య సాంస్కృతిక రంగాల్లో చేస్తున్నదని, ఇది చరిత్రలో నమోదు చేయవలసిన అవసరం ఉందని అన్నారు. దశాబ్దాల కాలం పాటు విశేషమైన కృషి చేస్తూ తెలుగు రాష్ట్రాల్లోనే పేరొందిన సంస్థగా టిజివి కళాక్షేత్రం పేరు పొందిందని పేర్కొన్నారు. అధ్యక్షులు పత్తి ఓబులయ్య కృషి అనితర సాధ్యమైనదని ఈ సందర్భంగా అన్నారు. వేలమంది కళాకారులను ఒంటి చేత్తో నడిపించడం సాధ్యం కాదని అన్నారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అందుకున్న వారిలో పత్తి ఓబులయ్య, కార్యదర్శి రామస్వామి ఉన్నారు.

గూడూరు ఎస్‌ఐగా హనుమంత రెడ్డి

ప్రజాశక్తి -గూడూరు : ఎస్ఐగా అనుమంతరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ చిరంజీవి కర్నూలు రేంజ్ విఆర్‌కు బదిలీ కావడంతో కోసిగి మండలంలో నేను పని చేస్తూ గూడూరుకు బాధ్యతలు చేపట్టానని, లాఅండ్‌ఆర్డర్ పైప్రత్యేకంగా నిఘా ఉంచుతామన్నారు. చోరీల నియంత్రణకు జూదం పేకాట కోడిపందాలు, నియంత్రలపై ఉక్కు పాదం మోపినా అలాగే కొనసాగుతున్నాయన్నారు. ముఖ్యంగా నాటు సారా తయారీ అమ్మకాలు జరగకుండా గట్టి జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.

అనుమతుల మేరకే ఎర్రమట్టి తవ్వకాలు

మైనింగ్ శాఖ ఎడి

ప్రజాశక్తి-సి బెళగల్ : సహజ సంపదలో భాగమైన ఎర్రమట్టిని అనుమతుల మేరకే భూగర్భ త్రవ్వకాలు చేపట్టాలని మైనింగ్ ఎడి కె.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం తహసీల్దార్ వెంకటలక్ష్మి సమక్షంలో ఎర్రమట్టి కొండ ప్రాంతాలను ఎడి తనిఖీ చేపట్టారు. ప్రజల అవసరాలకు, రైతుల అవసరాలకు ఇతర అభివృద్ధి పనులకు, ప్రభుత్వ పనుల అవసరం మేరకు అనుమతి తప్పనిసరిగా పొందాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ త్రవ్వి, ఇస్తారాజ్యంగా దోచుకోరాదన్నారు. ఎవరైనా అలా చేస్తే రెవిన్యూ అధికారులు సమాచారం ఇవ్వాలని కోరారు. ఖనిజాలను, భూగర్భ గనులను, సహజ సంపదను కాపాడుకోవడం మన బాధ్యత అని పేర్కొన్నారు. అసిస్టెంట్ జియాలజిస్ట్ రాజశేఖర్, విఆర్ఒలు వెంకటేశ్వర్లు, గౌరీ సిబ్బంది పాల్గొన్నారు.

అమరుల ఆశయాలను కొనసాగిద్దాం

-ఎన్ఆర్, జె సి ఎస్ ప్రసాద్‌ల సంస్మరణ సభ
-పిఒడబ్ల్యు ఆఫీస్ నుంచి సి క్యాంప్ వేదిక వరకు భారీ ర్యాలీ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

అమరుల ఆశయాలను తుది కంట కొనసాగిస్తామని సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసి నాయకులు అన్నారు. బుధవారం నీలం రామచంద్రయ్య, జంపాల చంద్రశేఖర ప్రసాద్ 50వ వర్ధంతిని పురస్కరించుకుని కర్నూలు నగరంలో పి ఒడబ్ల్యు ఆఫీస్ నుంచి సి క్యాంప్ వరకు సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అమరుల స్మారక స్థూపానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. అనంతరం వక్తలు అమరాత్మానికి యాభై ఏళ్ళు పుస్తకాన్ని ఆవిష్కరణ చేశారు. వారు మాట్లాడుతూమాజీ ఎంఎల్‌సి నీలం రామచంద్రయ్య, ఇంజనీరింగ్ విద్యార్థి జంపాల చంద్రశేఖర ప్రసాద్ పేదల పక్షాన నిలిచి పోరాటం చేసి అసువులు బాసారని తెలిపారు. వారు అమరులై నేటికీ 50 యేళ్ల పూర్తవుతుందని అన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కర్నూలు సి క్యాంప్ సెంటర్‌లో డ్రైవర్స్ అసోసియేషన్ ఫంక్షన్ హాల్ వర్ధంతి సభ నగర కార్యదర్శి బివిజి. వెంకటస్వామి అధ్యక్షతన నిర్వహించారు. అరునోదయ కళాకారులు విప్లవ గీతాలు ఆలపించారు. ఈ సభలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రసాద్, రాష్ట్ర నాయకులు ఇండ్ల ప్రభాకర్ రెడ్డి, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు భాస్కర్, నాయకులు మల్లికార్జున నరసింహులు శేషపని, రాజు, మణి అరుణోదయ కళాకారులు విమలక్క ప్రసంగించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్ఆర్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నీలం రామచంద్రయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సిపిఐఎంఎల్ నేతలు

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు తక్షణమే ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం ప్రకటించిన మద్దతుధర ప్రకారం కొనుగోలుచేసి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కర్నూలు కార్మిక కర్షక భవన్‌లో ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి ఎ.కృష్ణ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మొక్కజొన్నను కర్నూలు జిల్లాలో విస్తారంగా సాగు చేస్తారని తెలిపారు. ఈ సంవత్సరం అధిక వర్షాలు, తుఫాన్ వల్ల పంట దెబ్బతిని దిగుబడి లేక నష్టపోయారని తెలిపారు. వచ్చిన పంటకు ధర లేక ఆందోళన చెందుతున్నారన్నారు. రెండు మూడు రోజులుగా మార్కెట్ యార్డులో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర 2400 కాగా కేవలం రూ.1400 మాత్రమే కొనుగోలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అతివృష్టి, అనావృష్టి తుఫాను వల్ల రైతులు వ్యవసాయానికి దూరమవుతున్న పరిస్థితులలో ప్రభుత్వం ఆదుకోవాలి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తక్షణమే కర్నూలు జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.2400 క్వింటాలుకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులందరిని కూడగట్టి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి జిల్లాలో కనీసం మూడు కేంద్రాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

అగ్రిమెంట్ ప్రకారం కూలిరేట్లివ్వాలి

కాంట్రాక్టర్ పై చర్యలకు సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు ఎంఎల్ఎస్ పాయింట్ లో అగ్రిమెంటులో ఉన్న ప్రకారం కూలి రేట్లు అమలు చేయాలని కోరుతూ పౌరసరఫరాల జిల్లా మేనేజర్‌కు సివిల్ సప్లయ్ హమలీ యూనియన్ కార్యదర్శి సొలమన్ రాజు అధ్యక్షతన ఆర్జీ ఇచ్చారు. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు, సిఐటియు నగర ఉపాధ్యక్షులు మహమూద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేదలందరికీ ఆకలి తీర్చడం కోసం పౌరసరఫరాల సంస్థ నుండి బియ్యాన్ని సరఫరాచేస్తుందన్నారు. ఈ సంస్థలో కర్నూలు ఎంఎల్ఎస్ పాయింటు నుండి చౌక దుకాణాలకు బియ్యం సరఫరా చేయడానికి మెట్రిక్ టన్నుకు రూ.125 ఇవ్వాలని ప్రభుత్వం నుండి అగ్రిమెంట్ దక్కించుకున్న స్టేజ్ 2 కాంట్రాక్టర్ దేవేంద్రవర్మ హమాలి కార్మికులకు అగ్రిమెంటులో ఉన్న ప్రకారం కాకుండా రూ.120 మాత్రమే ఇస్తూ మోసం చేస్తున్నారని విమర్శించారు. చౌక దుకాణదారులు బియ్యం సరఫరాలో అవుతున్న ఖర్చులు భరించలేక హైకోర్టును ఆశ్రయించగా వారు కూలి రేట్లను నిర్ణయిస్తూ పౌరసరఫరాల సంస్థని భరించే విధంగా ఆర్డర్ ఇచ్చిందన్నారు. వాటి ప్రకారం అనుసరించాల్సిన స్టేజ్2 కాంట్రాక్టర్ అక్కడ హమాలీలుగా పనిచేస్తున్న కార్మికులను కొంతమంది రౌడీ మూకలను పెట్టుకుని భయభ్రాంతులకు గురి చేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ సంస్థలలో ప్రభుత్వం అమలు చేయాలని ఇచ్చిన జీవోలను, ఆర్డర్లను అమలు చేయడానికి ఇష్టంలేని కాంట్రాక్టర్లను అదుపు చేసి కార్మికులకు న్యాయం చేయాలని గోడౌన్ ఇన్‌ఛార్జికి అనేకమార్లు విన్నవించినా పట్టించు కోలేదని అన్నారు. ప్రభుత్వ అధికారులు ఇప్పటికైనా ఆలోచన చేసి అగ్రిమెంట్ ప్రకారం కూలి ఇవ్వకుండా కార్మికులను నష్టం చేసిన కాంట్రాక్టర్ దగ్గర నుండి ఇవ్వాల్సిన కూలిని ఇప్పించాలన్నారు. చట్టబద్ధంగా రెండు సంవత్సరాలకు ఒకసారి పెరిగిన ధరలకు అనుగుణంగా కూలిరేట్లను పెంచాలన్నారు. లేని పక్షాన పోరాటానికి దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. హమాలీ యూనియన్ నాయకులు బజారి, శివ పాల్గొన్నారు.

వినతి ఇస్తున్న నాయకులు

బ్రిడ్జి కమ్ భ్యారేజీలను ఆపాలి

-టిడిపి అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎంపి బస్తిపాటి నాగరాజు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్ణాటక ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన చిక్కమందోలి బ్రిడ్జికం భ్యారేజీ, , చిలకలపర్వి బ్రిడ్జికం భ్యారేజీలను తక్షణమే విరమించు కోవాలని టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు అన్నారు. గురువారం టిడిపి జిల్లా కార్యాలయంలో వారు విలేకరు సమావేశంలో మాట్లాడారు. గుండ్రేవుల ప్రాజెక్టుకు సహకరించాలని విజ్ఞప్తిచేశారు. కర్నాటక ప్రభుత్వం చెబుతున్నట్లుగా వారు 0.351 టిఎంసిలు కాదని, కర్ణాటక చేపట్టే ఈ నిర్మాణాలతో దాదాపుగా మూడు టిఎంసిల వరకు నీటిని లిఫ్ట్ చేసుకునేందుకు కర్నాటక ప్రయత్నాలన్నారు. ఇదే జరిగితే కర్నూలు జిల్లాకు సాగు, తాగునీరు అందే అవకాశం ఉండదన్నారు. అందువల్ల ఈ విషయమై కర్నూలు జిల్లాకు చెందిన మొత్తం ప్రజాప్రతినిధులమంతా కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి, రాష్ట్ర నీటిపారుదల శాఖా మాత్యులు నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకొని వెళ్లి కర్ణాటక చర్యలను ప్రతిఘటించే ప్రయత్నం చేస్తామన్నారు. ఇప్పటికే అప్పర్ భద్ర, ఆల్మట్టి వంటి ప్రాజెక్టులను నిర్మించి తెలుగు రాష్ట్రాలకు కర్ణాటక అన్యాయం చేసిందన్నారు. ఇప్పుడు వారు చేపట్టనున్న బ్రిడ్జికం బ్యారేజీలతో కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాలకు అన్యాయం జరుగనున్నదని తెలిపారు. కర్ణాటక ప్రభుత్వం ఈ నిర్మాణాలు చేపడితే రాయలసీమలోని కర్నూలు జిల్లా ఎడారిగా మారే ప్రమాదముందని అన్నారు.

భక్తకనకదాను జన్మదిన వేడుకలను నిర్వహించాలి

ఈ నెల 8న భక్త కనకదాసు జన్మదిన వేడుకలను ఘణంగా నిర్వహించాలని టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు టిడిపి శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. భక్త కనక దాసు తన కీర్తనలతో సమాజంలోని అట్టడుగు వర్గాలలో పెను మార్పులకు నాంది పలికారన్నారు.

వొకేషనల్ ప్రిన్సిపల్‌కు మరో అవార్డు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూల్, బి క్యాంప్ ప్రభుత్వ ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ నాగస్వామి నాయక్ కు యుఎన్ఒ అవార్డును అందుకున్నారు. గురువారం యుఎన్ఒ జారీచేసిన అవార్డు ప్రశంసా పత్రాన్ని కర్నూలు ఎంపీ బస్తీపాటినాగరాజు చేతుల మీదుగా అందుకున్నారు. కళాశాల టీచింగ్ , నాన్ టీచింగ్ సిబ్బంది ప్రిన్సిపాల్‌ను అభినందించారు.

సమస్యల పరిష్కారానికి 'ప్రజా దర్బార్'

- ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వికలాంగుని వినతిపత్రాన్ని స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బీవీ

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ వేదికగా మారుతుందని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని కుర్ని కల్యాణ మండపంలో పట్టణానికి చెందిన 34 వార్డుల ప్రజలతో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజాదర్బార్‌కు విశేష స్పందన లభించింది. 34 వార్డుల నుంచి 200లకు పైగా అర్జీలు వచ్చాయి. పింఛన్లు, ఇళ్ల స్థలాలు, టిడ్కో ఇళ్ల కేటాయింపు, భూసమస్యలు, నీటి కుళాయి కనెక్షన్లు, వీధి దీపాలు, సిసి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ తదితర సమస్యలపై ప్రజలు వినతిపత్రాలు సమర్పించారు. నాలుగు గంటలపాటు ఎమ్మెల్యే నిరాటంకంగా నిల్చొని అర్జీలు స్వీకరించారు. ప్రజల వినతులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాను గెలుపొందిన తర్వాత ప్రజాదర్బార్ నిర్వహిస్తూ.. ప్రజల నుంచి తీసుకున్న వినతిపత్రాలకు పరిష్కారం చూపుతున్నామని తెలిపారు. కోర్టులో ఉన్నవి మాత్రమే పరిష్కారం కావడం లేదన్నారు. టిడిపి పట్టణ అధ్యక్షులు మహేష్, పట్టణ కోశాధికారి విజయలక్ష్మి, మాజీ కౌన్సిలర్ రంగస్వామి గౌడ్, సీనియర్ నాయకులు మహేంద్ర పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

- పోలీసు స్టేషన్ వార్షిక తనిఖీలో డీఎస్పీ భార్గవి

ప్రజాశక్తి - గోనెగండ్ల

రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ భార్గవి

పిల్లల భద్రత, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ భార్గవి తెలిపారు. గురువారం వార్షిక తనిఖీలో భాగంగా గోనెగండ్లలోని అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. ముందుగా పోలీసు స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. క్రైమ్ రికార్డు, కేసుల వివరాలు, పురోగతిని సిఐ విజయభాస్కర్‌తో ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ... పాఠశాలకు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులు చదువుతోపాటు పిల్లల భద్రతపైనా దృష్టి సారించాలన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించని, పరిమితికి మించి పిల్లలను తరలించే ఆటోల్లో పిల్లలను పంపవద్దని తెలిపారు. మైనర్లకు వాహనాలిచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మండల ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాల బారిన పడితే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు పోలీసులను సంప్రదించాలని తెలిపారు. ట్రెయినీ ఎస్ఐ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

'పశుసంరక్షణ పద్ధతులు తెలుసుకోవాలి'

ప్రజాశక్తి - చిప్పగిరి

పశువులకు వైద్యం అందిస్తున్న పశువైద్యులు

పశుసంరక్షణ, సంతానోత్పత్తి పద్ధతులు, ఆరోగ్య నిర్వహణపై పశు సంపద ఉన్న ప్రతి ఒక్కరూ పశు వైద్యుల సలహాలు పాటిస్తూ, అవగాహన కలిగి ఉండాలని ఆలూరు అసిస్టెంట్ డైరెక్టర్ ధనుంజయ, చిప్పగిరి వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ దినకర్ బాబు, రామదుర్గం వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ కృష్ణ నాయక్ తెలిపారు. గురువారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఉచిత గర్భకోశ వ్యాధులు, చికిత్స శిబిరంలో భాగంగా దౌల్తాపురంలో పశు పోషకులకు ఆధునిక పశు సంరక్షణ పద్ధతులపై అవగాహన కలిగించారు. పశువుల ఉత్పాదకత పెంపొందించడమే లక్ష్యంగా పశు సంవర్ధక శాఖ ఈ శిబిరాన్ని నిర్వహిస్తోందని చెప్పారు. ఈ శిబిరంలో దాదాపు 41 పశువులకు పరీక్షలు, చికిత్సలు అందించామని తెలిపారు.

చెట్నిహాళ్లిలో కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - మంత్రాలయం

సంతకాల సేకరణ చేపడుతున్న నాయకులు

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టినట్లు వైసిపి మండల అధ్యక్షులు జి.భీమారెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, రాంపురం రెడ్డి సోదరుల ఆదేశాల మేరకు గురువారం మండలంలోని చెట్నిహాళ్లి గ్రామంలో వైసిపి శ్రేణులతో కాకుండా సామాన్యులతో సంతకాలు సేకరించారు. సర్పంచి అంజిని, ఉప సర్పంచి వీరనాగప్ప, ఎంపిటిసి రామాంజనేయులు, మాజీ సర్పంచి కురువ అల్లింగప్ప, గంగుల వెంకటేష్, తిక్కస్వామి, నాగేంద్ర పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు ప్రహరీ కరువు

- స్థానిక సమస్యల పరిష్కారానికి సిపిఎం పాదయాత్ర

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని కల్లుబావి శ్మశాన వాటికకు ప్రహరీ లేదని, కుక్కలు, పందులు మృతదేహాలను బయటకు తెస్తున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు, పట్టణ కార్యదర్శి లక్ష్మన్ తెలిపారు. గురువారం కల్లుబావి వీధిలో సిపిఎం పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రోజురోజుకు పట్టణం విస్తరిస్తోందని, అందుకనుగుణంగానే జనాభా కూడా పెరుగుతోందని తెలిపారు. తాగునీటి నిల్వ కోసం మరో ఎస్ఎస్ ట్యాంకు నిర్మించాలని కోరారు. కల్లుబావి, శంకర్ నగర్, ప్రకాష్ నగర్, భాస్కర్ రెడ్డి కాలనీ, మైనార్టీ కాలనీ, భీమ్ రెడ్డి కాలనీలో ఎవరైనా చనిపోతే కల్లుబావి శ్మశాన వాటికలో ఖననం చేస్తారని తెలిపారు. ఆ వార్డుల ప్రజలకు ఇది ఒక్కటే శ్మశాన వాటిక ఉందన్నారు. ప్రస్తుతం శ్మశాన వాటికకు రక్షణ గోడ లేకపోవడంతో రాత్రి వేళలో కుక్కలు, పందులు శ్మశానంలోని మృతదేహాలను బయటకు తీసుకొచ్చి చుట్టుపక్కల ఉన్న ఇళ్ల మధ్యలో వదిలేయడం వల్ల దుర్వాసన వెదజల్లడమే కాకుండా ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని చెప్పారు. అంత్యక్రియల కోసం శ్మశాన వాటికకు వెళ్లి వచ్చిన తర్వాత కనీసం కాళ్లు కడుక్కోవడానికి కూడా నీటి సౌకర్యం లేదన్నారు. శ్మశాన వాటికలో ముళ్లపొదలు విస్తరించి ఉన్నాయని, రోడ్డు సదుపాయం కూడా లేకపోవడంతో అంత్యక్రియల కోసం మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రక్షణ గోడ, రోడ్డు నీటి సౌకర్యం, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే భాస్కర్ రెడ్డి కాలనీలో తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శంకర్ నగర్ దగ్గర ఉన్న వంకకు రక్షణ గోడ నిర్మించి, రోడ్డు సౌకర్యం కల్పించాలని, వీవర్స్ కాలనీ, ప్రకాష్ నగర్‌లో మహిళల మరుగుదొడ్ల సమస్యను పరిష్కరించాలని కోరారు. శంకర్ నగర్‌లో ఉన్న ఎస్సీ కాంప్లెక్స్ భవనాలకు మరమ్మతులు చేపట్టి, మహిళలకు ఉపాధి శిక్షణ కేంద్రంగా మార్చితే ఆర్థికంగా మెరుగుపడతారని తెలిపారు. ఈనెల 15న సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు గోపాల్, ముక్కన్న, తిప్పన్న, నాయకులు నాగరాజు, కృష్ణమూర్తి, మల్లయ్య, మనోహర్, రామదాసు, ఉరుకుందు ఉన్నారు.

పాదయాత్రనుద్దేశించి మాట్లాడుతున్న వెంకటేశులు

'అనుభవంలో ఉన్న వారికి న్యాయం చేయాలి'

ప్రజాశక్తి - మంత్రాలయం

అనుభవంలో ఉన్న రైతులకే భూములిచ్చి న్యాయం చేయాలని రైతులు వనికె నాగరాజు, పిల్లి భీమేష్, సున్నం రఘు, గనేకంటి రఘు, చంద్రశేఖర్, ఎం.ప్రవీణ్ డిమాండ్ చేశారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కె.రమాదేవికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ... సర్వే నెంబర్ 157లో 9 మంది రైతులు చాలా ఏళ్లుగా సాగులో ఉన్నామని, 1912 తమ పెద్దల కాలం నుంచి అనుభవంలో ఉన్నామని తెలిపారు. దానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నాయని చెప్పారు. ఈసీ తీసినా తమ తాతల పేర్లే ఉన్నాయని పేర్కొన్నారు. మంచాల గ్రామంలో ఇనాం భూములుగా వర్గీకరించి.. సర్వే నెంబర్లు మార్చి నాటి రెవెన్యూ అధికారులు శ్రీమఠం భూములుగా రికార్డుల్లో ఎక్కించుకున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులు ఏ రికార్డుల ఆధారంగా ఆన్‌లైన్‌లో శ్రీమఠానికి చెందిన భూములుగా ఎక్కించారో తెలియదన్నారు. అనుభవంలో ఉన్న సుమారు 150 మంది రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని కోరారు. తహశీల్దార్ స్పందిస్తూ... 1969-70లోని ఎఫ్ఎల్ఆర్ ప్రకారం ఆన్‌లైన్‌లో నమోదు చేశారని, 8 మంది రైతులకు నోటీసులు జారీ చేసి వారి వద్ద ఉన్న రికార్డులను తీసుకురావాలని చెప్పామని తెలిపారు. నలుగురు రైతులు వచ్చి వారి వద్ద భూముల పత్రాలు చూపించారని, సబ్ కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించాలని లేదా న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని సూచించారు. తమ పరిధిలో లేని విషయంపై తాము మాట్లాడలేమన్నారు.

తహశీల్దార్‌తో మాట్లాడుతున్న రైతులు

శ్రీమఠంలో భక్తుల కోలాహలం

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో శ్రీమఠంలో కోలాహలం నెలకొంది. గురువారం స్వామివారి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకునేందుకు బారులు తీరారు. స్వామి వారికి ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించి, మంగళ హారతులు ఇచ్చారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు ముందస్తు ప్రణాళికతో తుంగభద్ర నదీతీరం నుంచి భక్తులకు కొత్తగా ఏర్పాటు చేసిన క్యూలైన్ ద్వారా దర్శనం కల్పించారు. శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి ఆధ్వర్యంలో సేవాదారులకు ప్రత్యేక దర్శన భాగ్యం కల్పించారు.

శ్రీమఠంలో కన్నడ సినీ నటుడు శశి కుమార్ : రాఘవేంద్ర స్వామిని కన్నడ సినీ నటుడు శశికుమార్ దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారికి శ్రీమఠం సహాయక పిఆర్ఓ హొన్నాళ్లి వ్యాసరాజాచార్ స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు.

మురుగు కాలువలో పైపులైన్...

- తాగునీరు కలుషితం కాదా..?

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని నెరుడుప్పల పంచాయతీ పిల్లిగుండ్ల గ్రామంలో 2024లో జలజీవన్ మిషన్ కింద సుమారు రూ.64 లక్షలతో ఇంటింటికి తాగునీటి కుళాయి పనులు ప్రారంభించారు. ఎన్నికల సమయంలో పనులను అసంపూర్తిగా నిలిపివేశారు. అనంతరం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామంలో పనులను తిరిగి చేపట్టి పూర్తి చేస్తున్నారు. రెండు రోజులుగా పిల్లిగుండ్ల గ్రామంలోని ఒంటెడుదిన్నె రోడ్డు వద్ద సుమారు 100 మీటర్ల మేర మురుగు కాలువపై తాగునీటి సరఫరా కోసం జిఐ పైపులైను వేస్తున్నారు. ఈ పైపులైను వేసేందుకు డ్రెయినేజీ కాలువ పక్కన స్థలం ఉన్నప్పటికీ డ్రెయినేజీ కాలువ మీదుగానే పైపులైన్ వేస్తున్నారు. వర్షం వచ్చినప్పుడు కాలువ నిండి మురుగునీరు ప్రవహిస్తుందని, మురుగునీటి ప్రవాహానికి జిఐ పైపులైను తుప్పు పట్టి తాగునీరు కలుషితమయ్యే అవకాశాలు ఉన్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. రూ.లక్షలు ఖర్చు పెట్టి గ్రామంలో చేపట్టే తాగునీటి పనులు కొన్ని దశాబ్దాల పాటు పాటు సురక్షితంగా ఉండాలని, మురుగు కాలువపై పైపులైన్ ఉంటే భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొంటున్నారు. పనులు చేపట్టిన వారి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.

మురుగు కాలువపై వేస్తున్న పైపులైన్

పంచాయతీ అధికారికి, కాంట్రాక్టర్‌కు తెలిపినా పట్టించుకోలేదు

- జనార్ధన్, పిల్లిగుండ్ల

తాగునీటి పైపులైను వేసేందుకు మురుగు కాలువ పక్కన ఖాళీ స్థలం ఉంది. సిమెంటు దిమ్మ ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంది. మురుగు కాలువలోనే తాగునీటి పైపులైను వేస్తున్నారు. భవిష్యత్తులో నీరు కలుషితమయి.. ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని కాంట్రాక్టర్‌కు, పంచాయతీ కార్యదర్శికి తెలియజేశాం. వారు పట్టించుకోలేదు. మురుగు కాలువ మీదే పైపులైను వేశారు. ఉన్నతాధికారులు దీనిని పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలి.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

- ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శ్రీనివాస రెడ్డి

డ్రెయినేజీ పక్కన మట్టిలో పైపులైన్ వేస్తే తొందరగా దెబ్బతినే అవకాశాలు ఉంటాయి. మురుగు కాలువ ఉన్నప్పటికీ సిసి రోడ్డు కాంక్రీట్‌పైన పైపులైను వేసి క్యాంపులు బిగించారు. శుక్రవారం పనులను పరిశీలించి ఇబ్బందులు ఉంటాయని అనిపిస్తే వెంటనే అవసరమైన చర్యలు చేపడతాం.

తాగు, సాగునీటి కోసం పోరాటం

- సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి హనుమంతు

ప్రజాశక్తి - హాలహర్వి

వేదవతి, నగరడోనా రిజర్వాయర్లు పూర్తి చేసేందుకు ఉద్యమించి, ప్రజల దాహార్తి, రైతుల కోసం సాగునీటి కోసం ప్రజలంతా ఏకమై ఉద్యమించాలని సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి హనుమంతు తెలిపారు. ఈనెల 9, 10వ తేదీల్లో జరిగే పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు. గురువారం హాలహర్విలో జీపుజాతాను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... మండలంలోని వేదవతి రిజర్వాయర్‌ను పూర్తి చేస్తే మండలం ఎంతో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అభివృద్ధి చేస్తామని చెబుతూ ఆలూరు ప్రాంతంలోని సాగు భూములను ప్రయివేట్, కార్పొరేట్‌కు కూటమి ప్రభుత్వం దోచిపెడుతోందని మండిపడ్డారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో రైతులు, కూలీలు వలస వెళ్లి ప్రమాదాలకు గురై మరణిస్తున్నారని తెలిపారు. వేదవతి, నగరడోన రిజర్వాయర్లకు నిధులు కేటాయించి పనులు చేపట్టాలని, దేవరగట్టులో జింకల పార్కు ఏర్పాటు, మండలంలోని వాటర్ స్కీమ్‌ల నుంచి నీరు పంపిణీ చేయాలని డిమాండ్ చేశాడు. సిపిఎం నాయకులు నారాయణ స్వామి, కృష్ణ, మైనా, విఠల్ పాల్గొన్నారు. **చిప్పగిరి** మండలంలోని రామదుర్గం, నగరడోనా, నేమకల్లు, బెల్డోన, చిప్పగిరి, ఏరూరు తదితర గ్రామాల్లో జీపుజాతా రెండోరోజూ సాగింది. సిపిఎం నాయకులు హనుమంతు, కెపి.నారాయణస్వామి మాట్లాడారు. వేదవతి, నగరడోనా రిజర్వాయర్ పనులను మొదలు పెట్టాలని, అందుకు అవసరమయ్యే నిధులను ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మొలగవెల్లి నుంచి నేమకల్లు గ్రామ బస్టాండ్ వరకు గత టిడిపి ప్రభుత్వంలో కొద్ది వరకు నిర్మాణ పనులు చేపట్టి అర్ధాంతరంగా నిలిపేశారని తెలిపారు. ఆ రోడ్డు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకే ఈ పాదయాత్ర, మహాధర్నా చేపడుతున్నామని, ప్రజలు, విద్యావంతులు, రైతులు సహకరించి జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం నాయకులు కృష్ణ, మైనా, విఠల్ పాల్గొన్నారు. **ఆదోని** మండలంలోని గణేకల్ గ్రామం నుంచి ఆటో జాతాను ప్రారంభించారు. ఈ జాతా కడితోట, జి.హోసల్లి, హానవాళ్లు, పెద్దహరివాణం, ఎడవల్లి, బలాదూర్, సంతేకుడ్లూరు, చిన్నహరివాణం, చిన్న గోనెహాలు గ్రామాల్లో సాగింది. సిపిఎం మండలం కార్యదర్శి లింగన్న, మండల కార్యదర్శి వర్గ సభ్యులు బి.వీరారెడ్డి మాట్లాడుతూ... మండలానికి సాగునీటి సౌకర్యం కల్పించడంలో గత ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని విమర్శించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి మండలంలోని ఎస్ఎస్ ట్యాంకుల నుంచి అదనపు పైపులైన్లు వేయాలని కోరారు. సిపిఎం మండల నాయకులు అయ్యన్న, శాఖ కార్యదర్శులు విరుపాక్షి, హనీఫ్ బాష, గోవిందు, పరమేష్, పార్టీ సభ్యులు లక్ష్మన్న, హుస్సేని, వీరేష్, చిరంజీవి, రామలింగప్ప, గజ్జప్ప పాల్గొన్నారు. **కౌతాళం** మండలంలో జీపుజాతా నిర్వహించారు. సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య, మండల కన్వీనర్ ఈరన్న మాట్లాడుతూ... తుంగభద్ర నదిపై వరద కాలువ నిర్మించాలి, లేదా కుంభాలనూరు దగ్గర బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మించాలని డిమాండ్ చేశారు. కౌతాళంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకలుగా మార్చి, హాల్విలో కొత్తగా హాస్పిటల్ నిర్మించాలన్నారు. మండలంలో మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలని కోరారు. సిపిఎం నాయకులు వలీ, రామదాస్ పాల్గొన్నారు.

హాలహర్విలో మాట్లాడుతున్న నాయకులు

ఆదోని

చిప్పగిరి

కౌతాళం

సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం వీడాలి

- మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం

- ఘనంగా మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా మహాసభలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు తెలిపారు. గురువారం మున్సిపల్ ఓపెన్ థియేటర్‌లో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ 3వ జిల్లా మహాసభలు నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మున్సిపల్ కార్మికులు దాదాపు 30 ఏళ్లుగా పని చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించడం లేదని, కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. 60 సంవత్సరాల పేరుతో కార్మికులను గ్రాట్యుటీ, పింఛను ఇవ్వకుండా తొలగిస్తున్నారని, అనారోగ్య కారణాలవల్ల మృతి చెందిన కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. అనంతరం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కె.ఇస్మాయిల్, ఉపాధ్యక్షులుగా సోమన్న, జయ నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా కైలాస్, సహాయ కార్యదర్శిగా ఓబులేసు, శాంతన్న, కోశాధికారిగా మనోహర్, 11 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభకు సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు, సిఐటియు మండల అధ్యక్షులు పి.గోవిందు, సిఐటియు నాయకులు యు.రమేష్, ఎ.సురేష్, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కె.ఖాజా, బి.మునీంద్ర, కె.గోరుబాష, బి.రంగస్వామి, కె.సాల్మన్, యు.లక్ష్మన్న పాల్గొన్నారు.

మహాసభలో మాట్లాడుతున్న నాగభూషణం

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

ప్రజాశక్తి - హాలహర్వి

సోమశేఖర్ (ఫైల్)

మండలంలోని సిద్ధాపురం గ్రామానికి చెందిన సోమశేఖర్ (13) విద్యుదాఘాతానికి గురయి మృతి చెందారు. గురువారం ఉదయం కుళాయికి నీరు రావడంతో ఇంట్లో మోటార్ ఆన్ చేసేందుకు వెళ్లి విద్యుదాఘాతానికి గురయి మృతి చెందారు. మృతుడిని తల్లిదండ్రులు గౌసిబీమా, శాంతమ్మ, అక్క రాధిక తెలంగాణకు వలసలు వెళ్లారు. సోమశేఖర్ అవ్వ గాంధమ్మతో ఉంటున్నారు.

కనకదాసు జయంతిని జయప్రదం చేయండి : సర్పంచి సుధాకర్

ప్రజాశక్తి - హోళగుంద

ఈనెల 8న కల్యాణ దుర్గంలో జరిగే కనకదాసు జయంతిని జయప్రదం చేయాలని ఎమ్‌డి.హళ్లి సర్పంచి సుధాకర్ కోరారు. గురువారం ఆయన మాట్లాడారు. ముఖ్య అతిథులుగా మంత్రి నారా లోకేష్, బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవితమ్మ, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, హిందూపురం ఎంపీ పార్థసారథి, కురువ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని కురులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బెస్తల ఆర్థిక బలోపేతానికి కృషి

- బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో బెస్త సామాజిక వర్గం ఆర్థిక బలోపేతానికి కృషి చేయాలని ఎపి బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు కోరారు. గురువారం రాష్ట్ర ఐటి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను మంగళగిరిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ... బెస్త సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు, గత ప్రభుత్వం జిఒ 217 తీసుకొచ్చి బెస్తలకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జిఒను రద్దు చేస్తూ చేపల పెంపకం, ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందించిందని తెలిపారు. రాబోయే రోజుల్లో బెస్తలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని నారా లోకేష్ తెలిపారు. టిఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు బెస్త జయసూర్య పాల్గొన్నారు..

మట్కాపై ఉక్కు పాదం : ఎస్ఐ

ప్రజాశక్తి - కోసిగి

ఎవరైనా మట్కా ఆడినా, రాసినా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రమేష్ రెడ్డి హెచ్చరించారు. గురువారం గ్రామంలో గతంలో మట్కా రాసే బీటర్ల ఇళ్లకు వెళ్లి తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ... మట్కాను ప్రోత్సహించిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ట్రెయినీ ఎస్ఐ ఈశ్వర రావు, హెడ్ కానిస్టేబుల్ నజీర్, పోలీసులు షాలం వలీ పాల్గొన్నారు.

కళాకారునికి సన్మానం

ప్రజాశక్తి - ఆదోని

నల్లా రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

పౌరాణిక నాటకాలను ప్రదర్శిస్తూ ఆకట్టుకుంటున్న నల్లారెడ్డిని గ్రామస్తులు సన్మానించారు. ఆస్పరి మండలం జొహరాపురం గ్రామంలో షష్టమాంకం నాటకంలో పాత్రతో ఆకట్టుకున్నారు. గ్రామస్తులు మాలమాల, శాలువా వేసి సన్మానించారని నల్లారెడ్డి గురువారం ఆదోనిలో తెలిపారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూబిజీనత్

రోడ్డు నిబంధనలు పాటించాలి

- జీనియస్ గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపల్ జూబిజీనత్

ప్రజాశక్తి - నందవరం

ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించి, ప్రమాదాలను అరికట్టాలని జీనియస్ గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపల్ జూబిజీనత్ తెలిపారు. ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు జీనియస్ గ్లోబల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు గురువారం ర్యాలీ నిర్వహించారు. 'జాగ్రత్తగా నడవండి - ప్రాణాలను కాపాడండి. హెల్మెట్ ధరిద్దాం - సురక్షితంగా ప్రయాణిద్దాం' వంటి నినాదాలతో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చని ప్రిన్సిపల్ తెలిపారు. ప్రమాదరహిత సమాజం నిర్మించాలంటే ప్రతి పౌరుడూ రోడ్డు భద్రత నిబంధనలను గౌరవించడం ఎంతో అవసరమని ఎఐ మాలిక్ తెలిపారు.

చదువుతూనే పోటీల్లో ప్రతిభ చాటాలి

- నారాయణ స్కూల్ ఎజిఎం రమేష్

ప్రజాశక్తి - ఆదోని

క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న సిబ్బంది

చదువుతో పాటు ఆటల పాటల్లోనూ విద్యార్థులు ప్రతిభ చూపాలని నారాయణ స్కూల్ ఎజిఎం రమేష్, ప్రధానోపాధ్యాయులు లక్ష్మిరెడ్డి తెలిపారు. గురువారం నారాయణ స్కూల్‌లో అంతర్గత ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పిల్లలకు క్రీడలు అనేవి మానసికోల్లాసాన్ని, శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపిన వారు సాంఘిక పరమైన అవగాహన చేసుకుంటారని తెలిపారు. ప్రతిభ గల విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

- ఎంపిడిఒ జ్యోతి

ప్రజాశక్తి- దేవనకొండ



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ

గ్రామ సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఎంపిడిఒ జ్యోతి సూచించారు. గురువారం ఆమె మండలంలోని పి.కోటకొండ, నెల్లిబండ గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా సందర్శించారు. ఆయా గ్రామ సచివాలయాల్లో ఉద్యోగుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ సచివాలయాల్లో జిఎస్‌డబ్ల్యు సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించి విధుల్లో ఉండాలని, లేకపోతే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

సిఎం సహాయ నిధితో కుటుంబాలకు భరోసా

- మంచాల సొసైటీ ఛైర్మన్ రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

సిఎం సహాయ నిధి బాధిత కుటుంబాలకు ఆర్థికంగా భరోసానిస్తుందని మంచాల సొసైటీ ఛైర్మన్ ఎన్.రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని మాధవరం గ్రామంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని పెద్దకడబూరు మండలం జాలవాడి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త ఎద్దుల బాబు, రామలక్ష్మి కుమార్తె వైష్ణవి వెన్నెముక ఆపరేషన్ కోసం రూ.2.50 లక్షల ఆర్థిక సహాయం మంజూరయిందని తెలిపారు. అనారోగ్య సమస్యతో బాధపడుతున్న వైష్ణవి ఆపరేషన్‌కు సహకరించాలని టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డిని తల్లిదండ్రులు కోరారని చెప్పారు. స్పందించిన ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి రూ.2.50 లక్షలు మంజూరు చేయించారని తెలిపారు. లబ్ధిదారురాలు తండ్రి బాబు చంద్రబాబుకు, లోకేష్‌కు, రాఘవేంద్రరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి జాలవాడి గ్రామ అధ్యక్షులు వెంకన్న, భీమన్న, భీమ, శాంతప్ప, రంగన్న, దేవదానం పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న నాయకులు

IN THE COURT OF THE HON'BLE IInd ADDITIONAL JUNIOR CIVIL JUDGE :: KURNOOL

I.A.No.408/2024 IN O.S.No: 1064/2024

1. Pedda Devanna, S/o late Dasanna, Aged 52 Years, Hindu, Agriculture,
2. Chinna Devanna, S/o late Dasanna aged 49 Years, Hindu, Agriculture,

Both are residents of Ulchala Village, Kurnool Mandal, Kurnool District. ...Petitioners

Vs

1. K. Pyapili Ramana,
2. K.Srinivasulu
3. Kondapogula Lakshmi Devi, S/o eddulamala, Hindu, aged 35 years, agriculture, All are residents of Masa Masjid, Sunkesla Road, Kurnool. ...Respondents

NOTICE TO 3rd RESPONDENT

పై నెంబరు I.A.No.408/24 IN O.S.No.1064/2024 ను రెస్పాండెంట్స్ అయినా మీపై ఇంజంక్షన్ దావాను దాఖలు చేసియున్నారు. సదరు కోర్టు వారు 3వ రెస్పాండెంట్ అయిన మీకు కోర్టు ద్వారా నోటీసులు పంపిన తీసుకోనందున పై కోర్టు వారు 3వ రెస్పాండెంట్ అయిన మీరు 12-11- 2025 ఉ॥10:30 ని॥లకు పై కోర్టు యందు హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల స్వయముగా కానీ వకీలు ద్వారా కానీ తెలుపు కొనవలెను. లేనియెడల మీ పరోక్షముగా తీర్మానించబడును

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిదా తేదీ : 12-11-2025
ఉ॥10:30 ని॥లకు

ఏ. జగదీష్ కుమార్,
అర్జీదారుపరం అడ్వకేటు,
కర్నూలు.
సెల్ నెంబర్ : 7386689999

IN THE COURT OF THE HON'BLE IInd ADDITIONAL JUNIOR CIVIL JUDGE :: KURNOOL

O.S.No: 1064/2024

1. Pedda Devanna, S/o late Dasanna, Aged 52 Years, Hindu, Agriculture,
2. Chinna Devanna, S/o late Dasanna aged 49 Years, Hindu, Agriculture,

Both are residents of Ulchala Village, Kurnool Mandal, Kurnool District. ...Plaintiff

Vs

1. K. Pyapili Ramana,
2. K.Srinivasulu
3. Kondapogula Lakshmi Devi, S/o eddulamala, Hindu, aged 35 years, agriculture, All are residents of Masa Masjid, Sunkesla Road, Kurnool. ...Defendants

SUMMONS TO 3rd DEFENDANT

పై నెంబరు దావా O.S.No.1064/2024 ను ప్రతివాదులు అయినా మీపై దావాను షెడ్యూలు ఆస్తిపై ఇంజంక్షన్ ఆర్డరు దావాను దాఖలు చేసియున్నారు. సదరు కోర్టువారు 3వ ప్రతివాది అయిన మీకు సమను పంపిన తీసుకోనందున పై కోర్టు వారు 3వ ప్రతివాది అయిన మీరు పై కోర్టు యందు హాజరు అగుటకు 12-11-2025 ఉ॥10:30 ని॥లకు వాయిదా వేసియున్నారు. పై దావాలో ఆక్షేపణలు ఉన్న యెడల స్వయముగా కానీ,వకీలు ద్వారా కానీ తెలుపు కొనవలెను. లేనియెడల మీ పరోక్షముగా తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిదా తేదీ : 12-11-2025
ఉ॥10:30 ని॥లకు

ఏ. జగదీష్ కుమార్,
వాదిపరం అడ్వకేటు,
కర్నూలు.
సెల్ నెంబర్ : 7386689999

ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నమూన పై అవగాహన...

-ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

-ట్రాఫిక్ సిఐ మన్సురుద్దీన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు డిఎస్‌పి బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో కర్నూలు ట్రాఫిక్ సిఐ మన్సురుద్దీన్ ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్ , రహదారి భద్రత పై ట్రాఫిక్ నమూనాతో అవగాహన కల్పించారు. ఈ సంధర్భంగా గురువారం కర్నూలు పట్టణంలోని సి.క్యాంపు దగ్గర ఉన్న ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో పాఠశాల విద్యార్థులను ఎక్కించుకుని వస్తున్న ఆటోల డ్రైవర్ల కు ట్రాఫిక్ క్రమబద్ధీరకణకు సహరించాలని ట్రాఫిక్ నమునా పై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలిపారు. వాహనాలను ఓవర్ టేక్ ఎక్కడ చేయాలి. ఎక్కడ చేయకూడదు, మద్యం సేవించి వాహనం నడపరాదని , డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్ వాడకాన్ని నివారించాలని , ఆటోలను రోడ్ల వెంట ఎక్కడపడితే అక్కడ నిలపడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని , ఆటోలలో అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

రాష్ట్ర స్కూల్ గేమ్స్‌కు గార్గేయపురం విద్యార్థులు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

విద్యార్థులలో దాగివున్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీస్తే అవి క్రీడా పోటీలకు దోహదపడతాయని గార్గేయపురం జడ్‌పి స్కూల్ హెచ్‌ఎం వెంకటరాముడు అన్నారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లా ఎస్‌జిఎఫ్ వారు నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-14 అండర్-17 బాల బాలికల బాస్కెట్ బాల్ ఎంపిక పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపిక అయినట్లు తెలిపారు. తమ పాఠశాలకు చెందిన భువనేశ్వరి అండర్-17 బాస్కెట్ బాల్ బాలికల విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికైందన్నారు. అండర్-14 బాలుర విభాగంలో తమ పాఠశాలకు చెందిన ఎం.నాసిర్ బేగ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికయ్యాడన్నారు. బాలికల విభాగంలో తమ పాఠశాలకు చెందిన జయలక్ష్మి ఎంపికైందనీ తెలిపారు. ఎంపికైన అండర్-14 క్రీడాకారులు అన్నమయ్య జిల్లాలో ఈనెల 24 నుంచి 26 వరకు జరగబోవు 69వ రాష్ట్రస్థాయి పోటీలలో కర్నూలు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఏలూరు జిల్లా నూజివీడులో ఈనెల 21 నుంచి

23 వరకు జరగబోవు 69వ రాష్ట్రస్థాయి బాస్కెట బాల్ పోటీలలో భువనేశ్వరి అండర్-17 విభాగంలో కర్నూలు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. అనంతరం వారికి క్రీడా దుస్తులు అందించి అభినందించారు. సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు పాల్ విజయకుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

'ఆశోక' అధ్యాపకులకు డాక్టరేట్లు ప్రదానం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఆశోక మహిళా ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు ఆయా రంగాలలో విశేషమైన పరిశోధనలతో పిహెచ్‌డి పట్టాలను సాధించి కళాశాల గౌరవాన్ని పెంచారు. గణితశాస్త్ర విభాగానికి చెందిన డాక్టర్ బి శ్రీదేవి, ద్రవిడియన్ యూనివర్సిటీ, కుప్పం, చిత్తూరు జిల్లా నుండి Some Results on Associativity and Commutativity of Rings అనే అంశంపై పరిశోధన చేసి పిహెచ్‌డి పట్టా పొందారు. ఆమె పరిశోధనకు డాక్టర్ డివి రామిరెడ్డి ప్రొఫెసర్, కెఎల్ యూనివర్సిటీ, విజయవాడ మార్గదర్శకత్వం వహించారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగంలోని డాక్టర్ శివ నందారెడ్డి ఎస్ఆర్‌ఎం సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్, కట్టాంకులత్తూరు, చెన్నై, తమిళనాడు నుండి Performance Evaluation of Foam Concrete with Silica Fume in Structural Applications అనే అంశంపై పరిశోధన చేసి పిహెచ్‌డి పట్టా పొందారు. పరిశోధనకు ఎస్ఆర్‌ఎం సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ ఆనంద్ మార్గదర్శకత్వం వహించారు.

డాక్టర్ శివశంకర్‌రెడ్డి

డాక్టర్ శిశిభూషణ్

డాక్టర్ బి.శ్రీదేవి

ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలోని డాక్టర్ ఎం ఏ శశిభూషణ్ పాండిచ్చేరీ సెంట్రల్ యూనివర్సిటీ నుండి Time Series Quasi Dynamic Load Flow Analysisfor Distribution Networks with Seasonal Load Variations అనే అంశంపై పరిశోధన చేసి డాక్టర్ ఎం సుధాకరన్ ప్రొఫెసర్, పాండిచ్చేరీ యూనివర్సిటీ మార్గదర్శకత్వంలో పిహెచ్‌డి పట్టా పొందారు. కళాశాల ప్రిన్సిపాల్ డా ఆర్ నవీన్ , సిఇఒ డాక్టర్ హరిస్ కృష్ణ, విభాగాధి పతులు, బోధనా సిబ్బంది అభినందనలు తెలిపారు. సిఇఒ డాహారిస్ కృష్ణ మాట్లాడుతూ అధ్యాపకులు సాధించిన ఈ విజయాలు ఆశోక కళాశాల అకడమిక్ బలం మరింతగా పెంచాయని అన్నారు.

క్రీడలకు ప్రాముఖ్యత ఇవ్వాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రతి విద్యార్థి చదువుతోపాటు శారీరక ధృఢత్వం కలిగి ఉండాలని స్కూల్ ఎజిఎం అన్వర్ బాషా సూచించారు. గురువారం కర్నూలులోని మాధవ నగర్ లోని నారాయణ పాఠశాలలో ప్రిన్సిపల్ మహమ్మద్ అల్తాఫ్ ఆధ్వర్యంలో నారాయణ ప్రీమియర్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఎజి ఎం. అన్వర్‌బాష, హైస్కూల్ కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మిలు క్రీడా పోటీలను ప్రారంభించారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అతిధుల చేతుల మీదుగా మేమెంటోస్, ధృవపత్రాలు అందజేశారు.

ఆర్‌యు సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కరువు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శరత్ డిమాండ్ చేశారు. గురువారం మంత్రి నారా లోకేష్ ను ఆయన కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులు భర్తీ చేయలన్నారు. మూసివేసిన కోర్సులను పునఃప్రారంభించి, నూతన కోర్సులు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. అన్యాక్రాంతమైన యూనివర్సిటీ భూములను పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు.

గ్యాస్ లీక్‌తో ఇల్లు ధ్వంసం

రూ.25 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి-వెల్దుర్తి

వెల్దుర్తి మండలం గోవర్ధనగిరిలో గురువారం గ్యాస్ లీకయి పేలుడుతో ఒక కుటుంబం ఆస్తిపాస్తులు కోల్పోయి తీవ్ర ఆవేదనకు గురైంది. రామాంజనేయులు ఇంట్లో ఉదయం 10 గంటల ప్రాంతంలో గ్యాస్‌లీక్ కావడంతో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఇంటి వాకిళ్లు ఎగిరిపడగా, చెక్క తలుపులు దూరంగా విసిరివేయబడ్డాయి. మంటల తీవ్రతతో ఇంట్లోని ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ పరికరాలు, దుస్తులు, పత్రాలు, నగదు అన్నీ బూడిదయ్యాయి. బాధితుడు రామాంజనేయులు తెలంగాణలో మామిడి పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన తల్లి మద్దమ్మ, భార్య లక్ష్మీపార్వతి, ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో కుటుంబ సభ్యులు కూలీ పనులకు వెళ్లారు. పిల్లలు స్కూలుకు వెళ్లడంతో ప్రాణ నష్టం తప్పింది. పేలుడు తీవ్రతతో బయట ఉన్న బైక్‌కు కూడా మంటలు అంటుకున్నాయి. స్థానికులు నీటితో మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేదు. వెంటనే సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుని మంటలనార్పారు. ఇంట్లో ఉన్న 10 తులాల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి వస్తువులు, రూ.97వేల నగదు, టివి, ఫ్రిజ్, దుస్తులు, పత్రాలు, పంట సామగ్రి అన్నీ మంటల్లో దగ్ధమయ్యాయి. పైకప్పు ఇనుప గ్రిల్, మెట్లు బీటలు వారాయి. సుమారు రూ.25 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిందని బాధితులు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గ్యాస్ పేలి ధ్వంసమైన ఇల్లు

సుప్రీం కోర్టు ఉత్తర్వులు అమలు చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రజా రహదారి మధ్యలో ప్రార్థన మందిరాలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలని రోజా మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట మహిళలతో కలిసి ఆమె ధర్నా నిర్వహించారు. అనంతరం డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేసి సుప్రీం కోర్టు ఆదేశాలను అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాముడు, కర్రెమ్మ,శేషమ్మ నారాయణమ్మ ముంతాజ్ షహనాబి షబానా పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిని కలిసిన పి.విజయకుమార్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రాష్ట్ర విద్య, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌ను నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పాలకవీటి విజయకుమార్ గురువారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలో మంత్రి నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయనను కలిసి నాయి బ్రాహ్మణ లకు సంబంధించిన పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లామన్నారు. నారాలోకేష్ నాయి బ్రాహ్మణుల సమస్యలపై సానుకూలంగా స్పందించారన్నారు.

గ్రామాలలో వీధిలైట్ల సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మండలంలోని గ్రామాల్లో నెలకొన్న వీధిలైట్ల సమస్యను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి నాగన్న డిమాండ్ చేశారు. గురువారం ఓర్వకల్లు ఎంపిడిఒ కార్యాలయంలో పరిపాలన అధికారికి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న, యువజన సంఘం నాయకులు మహేష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు మల్లేష్, శేషయ్య, నాగరాజు, వెంకటస్వామి, మద్దయ్య, కలిసి వినతి పత్రం అందజేశారు. బి.నాగన్న మాట్లాడుతూ గ్రామాలలో స్థానిక సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారన్నారు. అనేక చోట్ల వీధి దీపాలు వెలగక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. చీకటి పడితే బయటికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు , గ్రామాలలోసిసి రోడ్లతోపాటు మురుగుకాలువల నిర్మాణ పనులను చేపట్టాలకోరారు.

సుప్రీం కోర్టు ఉత్తర్వులు అమలు చేయాలి

ప్రజా రహదారి మధ్యలో ప్రార్థన మందిరాలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలని రోజా మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట మహిళలతో కలిసి ఆమెధర్నా నిర్వహించారు. అనంతరం డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేసి సుప్రీం కోర్టు ఆదేశాలను అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాముడు, కర్రెమ్మ,శేషమ్మ నారాయణమ్మ ముంతాజ్ షహనాబి షబానా పాల్గొన్నారు.